క్లుప్తంగా

31న విద్యా సదస్సు

నల్లగొండ: పట్టణంలోని ఎస్‌బీఆర్ గార్డెన్స్‌లో ఈ నెల 31న నిర్వహించనున్న విద్యా సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని డీటీఎఫ్ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 31న డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య, జిల్లా శాఖ అధ్యక్షుడు ఎండీ. ఖుర్షిద్‌మియా, జిల్లా శాఖ పూర్వ రాష్ట్ర కౌన్సిలర్ జె.వెంకటరాములు ఉద్యోగ విరమణ పొందనున్నారని తెలిపారు. అదేరోజు నిర్వహించనున్న విద్యా సదస్సు, పదవీ విరమణ కార్యక్రమానికి సంఘం నాయకులు, ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నకిరేకల్ : ఈ నెల 31 నల్లగొండలో జరిగే డీటీఎఫ్ జిల్లా విద్యా సదస్సును జయప్రదం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.వెంకటేషం కోరారు. సదస్సుకు సంబంధించిన ప్రచార కరపత్రాలను నకిరేకల్‌లో బుధవారం ఆయన విడుదల చేసి మాట్లాడారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నకిరేకల్ : పట్టణంలో 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు పనులు జరుగుతున్నందున గురువారం ఉదయం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సాయి గణేష్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడిగా రామకృష్ణ



రామగిరి(నల్లగొండ): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం తిప్పర్తి మండల అధ్యక్షుడిగా బొడ్డుపల్లి రామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి క్రిస్టఫర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మద్యం పట్టివేత

మునుగోడు: మండలంలోని గూడపూర్, కొరటికల్, చీకటిమామిడి గ్రామాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేసి బెల్టు దుకాణాల ద్వారా విక్రయిస్తున్న మద్యాన్ని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. మద్యాన్ని సీజ్‌చేసి మద్యం అమ్ముతున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సీహెచ్.వెంకటేశ్వర్లు తెలిపారు.

మర్రిగూడ: మండలంలోని దామెరబీమనపల్లి గ్రామానికి చెందిన యరెడ్ల నవీన్‌రెడ్డి వద్ద 26 రాయల్‌స్టాగ్ క్వాటర్లు, 4 ఐబీ క్వాటర్ బాటిళ్లు లభించినట్లు ఎస్‌ఐ కె.రంగారెడ్డి తెలిపారు. మద్యాన్ని పట్టుకుని అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ

మునుగోడు: మండలంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులను బుధవారం తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా క్లినిక్‌లు నడిపిస్తున్నారా, వైద్యులు లేకుండానే సొంతంగా ఎవరైనా శస్త్ర చికిత్సలు చేస్తున్నారా.. అని ఆరా తీశారు. తనిఖీల్లో కౌన్సిల్ సభ్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ పుల్లారావు, శ్రీనివాస్‌లతో పాటు మరో ఐదుగురు పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

నల్లగొండ టౌన్ : విద్యుత్ శాఖలోని రెవెన్యూ విభాగంలో కమీషన్ పద్ధతిలో పనిచేస్తున్న బిల్ కలెక్టర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి బుధవారం ఎలక్ట్రిసిటీ సూపరింటెండెంట్ ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేశారు. దండంపల్లి సత్తయ్య, లక్ష్మయ్య, ఎం.పర్వతరెడ్డి, సైదిరెడ్డి పాల్గొన్నారు.

కిశోర్‌కుమార్‌కు ఇందిరా గాంధీ ఎక్సలెన్సీ అవార్డు



అవార్డు అందుకుంటున్న కిశోర్‌కుమార్

నల్లగొండ టౌన్: నల్లగొండ పట్టణానికి చెందిన ఏఎస్‌ఐ డాక్టర్ పల్లె కిశోర్‌కుమార్ బుధవారం ఇందిరా గాంధీ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, సినీ నిర్మాత కె అచ్చిరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

బాధితులను ఆదుకుంటాం

నల్లగొండ టూటౌన్: గాలి దుమారానికి దెబ్బతిన్న ఇళ్ల బాధితులను ఆదుకుంటామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పానగల్ సమీపంలో గల లెప్రసీ కాలనీలో గాలి దుమారానికి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. గోలి మధుసూదన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కంకణాల నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పగిడి మహేష్, ప్రభంజన్, శరత్ సంతోష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చిట్యాల: పట్టణానికి చెందిన నిరుపేద మంగమ్మకు ఎమ్మెల్యే వేముల వీరేశం సమకూర్చిన రూ.10 వేల ఆర్థికసాయాన్ని బుధవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, కనకదుర్గ ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులు, ఎద్దులపురి కృష్ణ పాల్గొన్నారు.

నిలిచిన రోడ్డు నిర్మాణ పనులు

- పావురాలగూడెం–చౌళ్లగూడెం రోడ్డుకు రూ.3.02 కోట్లు మంజూరు
- సంవత్సర కాలంలో కేవలం కిలోమీటర్ నిర్మాణం
- మిగిలింది ఆరు కిలోమీటర్లు
- సమీపిస్తున్న అగ్రిమెంట్ గడువు



ఊట్కూరులో బీటీ తొలగించడంతో కంకర తేలి అధ్వానంగా మారిన రోడ్డు

శాలిగౌరారం: ×దేవుడు వరమిచ్చినా.. పూజారి అడ్డుకున్నట్లు×గా ఉంది మండలంలోని పావురాలగూడెం–చౌళ్లగూడెం ఆర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధి పనుల పరిస్థితి. రోడ్డు నిర్మాణం కోసం నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. అయితే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. అసంపూర్తిగా నిర్మించిన రోడ్డుపై రాకపోకలు సాగిస్తూ ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రూ. 3.02 కోట్లు మంజూరు

శాలిగౌరారం మండల కేంద్రంలోని పావురాలగూడెం బస్టాప్ నుంచి మండలంలోని మాధారంకలాన్ గ్రామపంచాయతీ పరిధి చౌళ్లగూడెం వద్ద ఉన్న 365వ నంబర్ జాతీయ రహదారి వరకు 7 కిలోమీటర్ల పొడవు ఉన్న ఆర్‌అండ్‌బీ సింగిల్ రోడ్డు అభివృద్ధికి 2023లో రాష్ట్ర ప్రభుత్వం రూ.3.02 కోట్ల నిధులు మంజూరు చేసింది. రోడ్డు పూర్తి చేయడానికి సంబంధిత కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం సంవత్సరన్నర గడువు ఇచ్చింది. 20 జూన్ 2023న రోడ్డు నిర్మాణ పనులను అప్పటి తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ మండల కేంద్రంలో ప్రారంభించారు. 7 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణంలో కిలోమీటర్ సీసీ రోడ్డు కాగా 6 కిలోమీటర్లు బీటీ రెన్యూవల్ పనులు చేపట్టవలసి ఉంది. పావులరాలగూడెంలో 18 అడుగుల వెడల్పు 600 మీటర్ల పొడవు, ఊట్కూరు గ్రామంలో 12 అడుగుల వెడల్పుతో 400 మీటర్ల పొడవు సీసీరోడ్డు నిర్మాణం జరిగింది.

నేటికీ మొదలుకాని బీటీ రెన్యూవల్ పనులు

పావురాలగూడెం బస్టాప్ నుంచి 365వ నంబర్ జాతీయ రహదారి వరకు 7 కిలోమీటర్ల పొడవు ఉన్న ఆర్‌అండ్‌బీ సింగిల్ రోడ్డులో కిలోమీటరు సీసీరోడ్డు నిర్మాణం మినహా మిగిలిన ఆరు కిలోమీటర్ల బీటీ రెన్యూవల్ పనులు నేటికీ మొదలుపెట్టలేదు. రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం 18 నెలల గడువు ఇవ్వగా ఇప్పటికే సంవత్సరం గడిచిపోయింది. ఇప్పటివరకు రూ.కోటి విలువ కలిగిన కిలోమీటరు సీసీ రోడ్డు మాత్రమే నిర్మించగా ఆరు కిలోమీటర్ల బీటీ రోడ్డు రెన్యూవల్ పనులు చేపట్టాల్సి ఉంది. కానీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో నిర్ణీత గడువులోపు రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యేనా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఇదిలా ఉండగా రూ. కోటి విలువ కలిగిన సీసీ రోడ్డు పనులు పూర్తయినా సంబంధిత కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో పనులు ముందుకు సాగడంలేదని కొందరు చెబుతున్నారు. అయితే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే నిధుల చెల్లింపులు జరగలేదనే మరికొందరు పేర్కొంటున్నారు. రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి తమ కష్టాలు తీర్చాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



పావురాలగూడెం–చౌళ్లగూడెం రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని మాధారం, పెర్కకొండారం, ఇటుకులపహాడ్, వంగమర్తి గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లాలంటే ఈ రోడ్డు ఒక్కటే ప్రధాన మార్గం. అసంపూర్తిగా ఉన్న ఈరోడ్డు మీద నుంచి నిత్యం ఆయా గ్రామాల ప్రజలు వివిధ పనుల కోసం మండల కేంద్రానికి వెళ్లి వస్తూ అవస్థలు పడుతున్నారు. రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి.

–జేరిపోతుల చంద్రమౌళి, మాధారంకలాన్

నోటీసులు జారీచేశాం



పావురాలగూడెం–చౌళ్లగూడెం రోడ్డు అభివృద్ధి పనులు కాంట్రాక్టర్ చేస్తున్న జాప్యం వల్ల నిలిచిపోయాయి. ఇప్పటికే పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారుల ఆదేశానుసారం రోడ్డు నిర్మాణదారుడికి నోటీసులు కూడా జారీ చేశాం. నోటీసులకు జవాబు రాగానే తదుపరి చర్యలు తీసుకుంటాం. రోడ్డు నిర్మాణానికి మరో ఆరునెలలకు పైగా గడువు కూడా మిగిలి ఉండడంతో బీటీ రెన్యూవల్ పనులు సకాలంలో జరిగేలా చర్యలు చేపడతాం.

–సంతోష్‌కుమార్ ఆర్‌అండ్‌బీ ఏఈ, శాలిగౌరారం

సాదాసీదాగా సామాజిక తనిఖీ ప్రజావేదిక



ప్రజా వేదికలో పాల్గొన్న అడిషనల్ డీఆర్‌డీఓ నవీన్‌కుమార్, అధికారులు

కేతేపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా కేతేపల్లి మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు రూ.4.16 కోట్ల నిధులతో చేపట్టిన పనులపై బుధవారం పదమూడో విడత సామాజిక తనిఖీ(ఓపెన్‌ఫోరం) నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశానికి ప్రజాప్రతినిధులు, కూలీలు హాజరు కాలేదు. కేవలం సామాజిక తనిఖీ బృందం సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది మాత్రమే పాల్గొనడంతో సాదాసీదాగా సాగింది. మండలంలో 16 గ్రామాలు ఉండగా ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సమావేశాన్ని మధ్యాహ్నం ఒంటి గంటకు ముగించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీఆర్‌డీఓ కె.నవీన్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు అవసరమయ్యే పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈజీఎస్ పథకం కింద చేపట్టిన ప్రతి పని ప్రజలకు శాశ్వత ప్రాతిపదికన ప్రయోజనం కలిగే విధంగా ఉండాలని సూచించారు. హరితహారం కార్యక్రమంలో గ్రామాల్లో మొక్కల పెంపకాన్ని మొక్కుబడిగా కాకుండా సామాజిక బాధ్యతగా చేపట్టాలన్నారు. మొక్కలు నాటే నాటికి అన్ని గ్రామాల నర్సరీల్లో మొక్కలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీవీఓ సీహెచ్.వేణుగోపాల్‌రావు, అంబుడ్స్‌మెన్ ఎండీ.ఘోరి, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, క్లస్టర్ ఏపీడీ నర్సింహారావు, ఎస్‌టీఎం నరేందర్, ఏపీఓ సురేందర్, ఎస్‌ఆర్పీ కాశన్న, ఏఎం పి.గౌతమి, పీఆర్ ఏఈ సంపత్, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అరగంటలో ముగిసిన సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మయ్య

శాలిగౌరారం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. 11.25 గంటలకు ప్రారంభమైన సమావేశం 11.55 గంటలకు ముగిసింది. సమావేశానికి ప్రభుత్వ శాఖల అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకాకపోగా కనీసం ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను కూడా సమావేశానికి అందించకపోవడం గమనార్హం. కిందిస్థాయి సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు. జెడ్పీటీసీతోపాటూ 13 మంది ఎంపీటీసీలు, ఇద్దరు కోఆప్షన్ సభ్యులు ఉండగా ఎంపీపీతోసహా ఆరుగురు సభ్యులు మాత్రమే హాజరయ్యారు. మండలంలో మిషన్ భగీరథ పథకం ద్వారా సరిపడా తాగునీరుసరఫరా కావడం లేదని సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా తాగునీటి నిర్వహణకు సంబంధించి ఎస్‌డీఎఫ్ నిధుల వినియోగం, పనుల నిర్వాహణపై స్థానిక ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వకుండా నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఏఈని నిలదీశారు. ఈ విషయంపై సమాధానం ఇచ్చేందుకు మిషన్ భగీరథ ఇంట్రా ఏఈ రాంబాబు ప్రయత్నించగా సభ్యులు అడ్డుకున్నారు. ఎంపీపీ గంట లక్ష్మమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీడీఓ లక్ష్మయ్య, డిప్యూటీ తహసీల్దార్ ఎండి సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా విత్తనాలు సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ రామారావు

శాలిగౌరారం: నకిరేకల్ వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో పంటల సాగుకు సంబంధించిన అన్ని రకాల విత్తనాలు, ఎరువులు సరిపడా ఉన్నాయని నకిరేకల్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రామారావు అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం) ఆధ్వర్యంలో జరుగుతున్న పచ్చిరొట్ట, ఎరువుల అమ్మకాలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం నకిరేకల్ డివిజన్‌కు 448 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయన్నారు. శాలిగౌరారం మండలానికి 100 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు వచ్చాయని అందులో 42.50 క్వింటాళ్ల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. పచ్చిరొట్ట విత్తనాలను 60 శాతం ప్రభుత్వ సబ్సిడీతో అందిస్తున్నామని, జీలుగు(30కిలోలు) రూ.1116లకు, జనుము(40కిలోలు) రూ.1448లకు రైతులకు అందిస్తున్నామన్నారు. నకిరేకల్ డివిజన్‌లో 2.22 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కానున్నాయని, అందులో పత్తి లక్ష ఎకరాల్లో, 1.22 లక్షల ఎకరాల్లో వరిపంట సాగుకానుందన్నారు. పత్తిసాగు కోసం 2.50 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు అవసరం ఉండగా సాగుకు సరిపడా విత్తనాలు సంబంధిత దుకాణాలలో సిద్ధంగా ఉన్నాయన్నారు. శాలిగౌరారం మండలంలో 23వేల ఎకరాల్లో పత్తిపంట, 19వేల ఎకరాలలో వరిపంటలు సాగు కానున్నాయన్నారు. సమావేశంలో ఏఓ సౌమ్యశృతి, పీఏసీఎస్ సీఈఓ నిమ్మల ఆంజనేయులు, ఏఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాల అమ్మకంలో నిబంధనలు పాటించాలి



తిప్పర్తిలోని విత్తనాల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ సన్నీరాజ్



మునుగోడు : సింగారంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్రీనివాస్‌గౌడ్

నార్కట్‌పల్లి : విత్తనాలు ఎరువులు, పురుగు మందుల అమ్మకంలో డీలర్లు నిబంధనలు పాటించాలని నకిరేకల్ వ్యవసాయ సహాయ సంచాలకులు రామారావునాయక్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో నకిలీ విత్తనాల నిర్మూలనపై అధీకృత డీలర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్‌ఐ అంతిరెడ్డి మాట్లాడుతూ ఎవరైనా రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎడవల్లి గిరిప్రసాద్, ఏఈఓ లియాఖత్‌అలీ పాల్గొన్నారు.

తిప్పర్తి మండలంలో..

రామగిరి(నల్లగొండ): అనుమతులు లేని దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేయొద్దని తిప్పర్తి ఏఓ సన్నీరాజ్ అన్నారు. బుధవారం తిప్పర్తి మండల కేంద్రంలోని దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్ కేంద్రంలో జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సంతోషి తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులు జాగ్రత్తలు వహించాలి

కనగల్ : వానాకాలం సీజన్‌లో పత్తి సాగు చేసే రైతులు విత్తనాలు తీసుకునే ముందు జాగ్రత్తలు వహించాలని మండల వ్యవసాయాధికారి అమరేందర్ గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి రశీదు కచ్చితంగా తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు, విడి విత్తనాలను అమ్మితే ఫోన్‌లో సమాచారం అందించాలన్నారు.

విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలి

కేతేపల్లి: విత్తనాల కొనుగోళ్లలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని కేతేపల్లి ఏఓ బి.పురుషోత్తం సూచించారు. బుధవారం మండలంలోని తుంగతుర్తి, బండపాలెం గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ముందుగా ఆయా గ్రామాల్లో ఫర్టిలైజర్ దుకాణాలను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఏఈఓలు బాలరాజు, వీరేష్, ఉమేష్ ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

చిట్యాల: పత్తి విత్తనాల కొనుగోలుపై మండలంలోని గుండ్రాంపల్లి, వనిపాకల, తాళ్ళవెల్లెంల, పిట్టంపల్లి గ్రామాల రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ పగిడిమర్రి గిరిబాబు మాట్లాడుతూ గ్రామాల్లో తక్కువ ధరకు, ఎలాంటి రశీదులు ఇవ్వకుండా అమ్మే విత్తనాలను కొనుగోలు చేయవద్దని, నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని రైతులకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఏఈఓలు వీణకుమారి, మెహీన్, మనీషా, వికాస్, రైతులు పాల్గొన్నారు.

తొందరపడి విత్తనాలు వేయొద్దు

మునుగోడు: వానాకాలం పంటలు సాగుచేసే రైతులు చాలీచాలని వర్షాలు కురవగానే తొందరపడి విత్తనాలు వేయొద్దని, కనీసం 65 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైన తరువాతే విత్తనాలు నాటుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. బుధవారం మండలంలోని సింగారం, చల్మెడ గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఒకే రకం పత్తి విత్తనాలపై మక్కువ పెంచుకుని ఆ విత్తనాలే కావాలనే ఆలోచన మానుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏఈఓలు నర్సింహ, వహీద్, రైతులు పాల్గొన్నారు.

మర్రిగూడ: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని ఏవో హేమలత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీ చేసి విత్తన స్టాక్ రిజిస్టర్‌ను, రసీదులను పరిశీలించారు. దుకాణాదారులు తప్పనిసరిగా లైసెన్స్‌లు పొందిన వారి నుంచే విత్తనాలను పొందాలని సూచించారు.

బైపాస్ అలైన్‌మెంట్ మార్చాలని మంత్రికి వినతి



వినతి పత్రం అందజేస్తున్న బాధితులు

నల్లగొండ రూరల్: నల్లగొండ పట్టణం చుట్టూ ప్రస్తుతం నిర్మించతలపెట్టిన బైపాస్ రోడ్డులో ఇళ్లు, ఇళ్ల స్థలాలు కోల్పోతామని, అలైన్‌మెంట్ మార్చి తమకు న్యాయం చేయాలని కోరుతూ పలువురు మంత్రి కోమటిరెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో సుధాకర్‌రెడ్డి, జాన్‌రెడ్డి, రాజయ్య, శ్రీనివాస్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సర్టిఫికెట్లు అందజేత

కనగల్ : మండల పరిధిలోని జి యడవల్లి గ్రామంలో ఐరా ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో యడవల్లి యువజన సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని విద్యార్థులకు 15 రోజులపాటు ఉచితంగా కంప్యూటర్ బేసిక్స్ శిక్షణ ఇచ్చారు. బుధవారం శిక్షణ ముగియడంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దోటి సైదులు మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా అమెరికాలో స్థిరపడిన జి యడవల్లి గ్రామస్తుడు చెరుపల్లి వెంకటేషం శిక్షణ కోసం కంప్యూటర్‌లు అందజేయడం అభినందనీయమన్నారు. యడవల్లి యూత్ ఫౌండర్, కంప్యూటర్ శిక్షణ ట్రైనర్ కొర్వి శ్రీనివాస్ యూత్ అధ్యక్షుడు ముచ్చపోతుల నరేష్, ప్రధాన కార్యదర్శి తోరకొప్పుల శేఖర్, శివదుర్గ ఫౌండేషన్ చైర్మన్ పర్సనబోయిన వెంకటేష్, ముదిరాజ్ గ్రామ అధ్యక్షుడు బొమ్మకంటి శివ పాల్గొన్నారు.

పటేల్ నగర్‌లో చోరీ

నకిరేకల్ : తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగిన సంఘటన మంగళవారం నకిరేకల్‌లోని పటేల్ నగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటేల్ నగర్‌లో నివాసం ఉంటున్న నామ నవీన్ కుటుంబ సభ్యులు వేసవి సెలవులకు పుట్టింటికి వెళ్లారు. నవీన్ కూడా మంగళవారం ఉదయం ఇంటికి తాళం వేసి పని మీద హైదరాబాద్‌కు వెళ్లాడు. పని ముగించుకుని అదేరోజు రాత్రి 11 గంటలకు ఇంటికి వచ్చాడు. తీరా చూస్తే ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపల బీరువా తాళం కూడా పగులగొట్టారు. అందులో ఉన్న 5 తులాల బంగారు ఆభరణాలతోపాటు కొంత నగదును దొంగలు చోరీ చేశారని బుధవారం నవీన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నకిరేకల్ ఎస్‌ఐ గోపికృష్ణ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి క్లూస్ టీంను పిలిపించి నమూనాలు సేకరించారు.

ముగిసిన శిక్షణ తరగతులు

నకిరేకల్ : మున్సిపాలిటీ కేంద్రంలోని గీతా మందిరంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహించిన ఆధ్యాత్మిక వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. 75 మంది బాలబాలికలు, 64 మంది పెద్దలు శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. ముగింపు వేడుకల్లో విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు భోజనపల్లి నర్సింహమూర్తి, గీతా మందిర అధ్యక్షుడు పబ్బతి వెంకన్న, వీహెచ్‌పీ జిల్లా సహాయ కార్యదర్శి సంపత్‌కుమార్, మాతృశక్తి పరిషత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జమాయిల్ తోట దగ్ధం

నకిరేకల్: మండలంలోని నెల్లిబండ శివారులో ఓ రైతుకు చెందిన జమాయిల్ తోటకు నిప్పంటుకుంది. ఈప్రమాదంలో దాదాపు మూడు ఎకరాల తోట కాలిపోయింది. వివరాలు.. గ్రామంలోని రైతు యానాల వెంకట్‌రెడ్డికి పత్తి మిల్లు సమీపంలో నకిరేకల్ మున్సిపాలిటీ డంపింగ్ యార్డు పక్కన 5 ఎకరాల జమాయిల్ తోట ఉంది. ఈ తోటలో బుధవారం సాయంత్రం మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల రైతులు చూసి వెంకట్‌రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. రైతు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. ఫైర్ సిబ్బంది చేరుకునే సరికి మూడు ఎకరాల తోట కాలిపోయిందని బాధిత రైతు తెలిపారు.

పాటి అనసూయకు నివాళి

చిట్యాల: పట్టణానికి చెందిన మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు పాటి మాధవరెడ్డి, మోహన్‌రెడ్డి తల్లి అనసూయ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమంలో రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యలు వేర్వేరుగా పాల్గొని అనసూయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, ఏఎంసీ మాజీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు కందిమళ్ళ శిశుపాల్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పిశాటి భీష్మారెడ్డి, కర్నాటి ఉప్పల్‌రెడ్డి, వనమా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, తదితరులు

సమస్యలు పరిష్కరించాలని వినతి



లేబర్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని సాయిదుర్గ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్న గ్యాస్ డెలివరీ బాయ్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్యాస్ డెలివరీ బాయ్స్ యూనియన్ అధ్యక్షుడు బొబ్బిలి శేఖర్ బుధవారం కలెక్టర్ హరిచందనకు, లేబర్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ తాము 20 ఏళ్లుగా ఏజెన్సీలో గ్యాస్ డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తున్నామని, అతితక్కువ వేతనం ఇస్తున్నారని, కనీస సౌకర్యాలు కల్పించాలని ఏజెన్సీ యాజమాన్యాన్ని కోరితే తమను పనిలో నుంచి తీసివేశారని అన్నారు. ఆయన వెంట గోవర్ధన్ శంకర్, నరసింహ వెంకన్న తదితరులు ఉన్నారు.

మర్రిగూడ : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేసి కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు.

సీతారామచంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం

చిట్యాల: మండలంలోని చిన్నకాపర్తి గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ తొమ్మిదో వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, ఉప్పరబోయిన స్వామి పాల్గొన్నారు.

గీతకార్మికుడికి తీవ్ర గాయాలు

నకిరేకల్ : తాటి చెట్టు పైనుంచి జారిపడి ఓ గీతకార్మికుడుకి తీవ్ర గాయాలైన సంఘటన నకిరేకల్‌లో బుధవారం చోటుచేసుకుంది. నకిరేకల్‌లోని 15వ వార్డులో నివాసం ఉంటున్న కొండ సైదులు నకిరేకల్ శివారులో తాటి చెట్టు ఎక్కేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో మోకు జారి కింద పడిపోయాడు. దీంతో సైదులుగౌడ్‌కు బలమైన గాయాలయ్యాయి. అతడిని కుటుంబ సభ్యులు నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కొండ జానయ్యగౌడ్ ఆస్పత్రికి చేరుకుని సైదులును మెరుగైన వైద్యం కోసం హై దరాబాద్‌కు తరలించారు.

తీరిన తాగునీటి కష్టాలు

సాక్షి ఎఫెక్ట్..

మునుగోడు: వారం రోజులుగా మునుగోడు గ్రామ పంచాయతీ పరిధిలోని రామకృష్ణాపురం ప్రజలు ఎదుర్కొంటున్న మంచి నీటి సమస్యను బుధవారం అధికారులు పరిష్కరించారు. ఆ కాలనీ నీటి సమస్యపై సాక్షి దినపత్రికలో బుధవారం రామకృష్ణాపురంలో మంచినీటి కష్టాలు అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు కాలనీకి వెళ్లి నీటి సమస్య తలెత్తడానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఆ గ్రామానికి నీరు సరఫరా చేసే బోరు పైపులైన్ అక్కడక్కడ పగిలిపోవడంతోపాటు మోటార్ మరమ్మతులకు గురైందని గుర్తించారు. పైపులైన్, మోటార్‌కు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.